రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యం

అమెరికా కంపెనీలను ప్రోత్సహించండి

● ప్రవాస తమిళులకు స్టాలిన్ పిలుపు



శాన్‌ఫ్రాన్సిస్కోలోని ప్రవాస తమిళుల సమావేశంలో ...ట్లాడుతున్న ...ం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధి చెందుతున్న తమిళనాట అమెరికా కంపెనీలు పెట్టుబడి పెట్టేలా ప్రవాస భారతీయులు, ప్రత్యేక ఆ దేశంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తమిళులు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో ప్రవాస తమిళులు, తమిళ పారిశ్రామికవేత్తలు, వివిధ తమిళ సంఘాల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న స్టాలిన్ మాట్లాడుతూ ఈ సమావేశానికి సతీసమేతంగా విచ్చేసిన తనకు తమిళ సంస్కృతీ సంప్రదాయాలతో ఘనంగా స్వాగతించడం చూసి తానున్నది శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలోనా లేక చెన్నైలోనో అనే సందేశం కూడా కలుగుతోందన్నారు. ఈ నగరంలోని భారత డిప్యూటీ రాయబారి శ్రీకర్‌రెడ్డి ఎల్లప్పుడూ చిరునవ్వుతో తన పర్యటనకు అన్ని విధాలా సహాయసహకారాలు అందించటం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రవాస తమిళులుగా ఈ దేశంలో స్థిరపడినవారినందరినీ ఒకే చోట చూడటం కూడా తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఓ అంతర్జాతీయ నివేదిక ప్రకారం అమెరికాకు నచ్చిన దేశాల్లో భారతదేశం ఏడోస్థానంలో ఉందని స్టాలిన్ చెప్పారు. అమెరికాలోని పారిశ్రామిక సంస్థలలో తమిళనాడుకు చెందిన పలువురు ఉన్నత పదవుల్లో ఉన్నారని, అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాలోనూ భారతీయ సంతతికి చెందినవారే అధికంగా ఉన్నారన్నారు. తమిళనాట 300కు పైగా అమెరికా సంస్థలు రాష్ట్రంలో తమ ప్రాజెక్టులను నెలకొల్పాయని, గత మూడేళ్లుగా అమెరికా సంస్థలే అధికంగా పెట్టుబడులు పెట్టాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి విచ్చేసిన ప్రవాస భారతీయులు, ప్రత్యేకించి తమిళులు, తమిళ పారిశ్రామికవేత్తలు, వివిధ బహుళజాతి సంస్థలలో ఉన్నతోద్యోగాలలో ఉన్న తమిళులు తమిళనాట పెట్టుబడులు పెట్టేలా అమెరికా కంపెనీలను ప్రేరేపించి ప్రోత్సహించాలని స్టాలిన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రవాస తమిళుల సంక్షేమ బోర్డు చైర్మన్ కార్తికేయ శివ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

రూ.400కోట్లతో చెంగల్పట్టులో ఓమియం ఫ్యాక్టరీ

గ్రీన్ హైడ్రోజెన్ ఉత్పత్తిలో పేరొందిన ఓమియం సంస్థ రాష్ట్రంలో రూ.400 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. చెంగల్పట్టు జిల్లాల్లో కర్మాగారం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఓమియం సంస్థ ఉన్నతాధికారులతో శనివారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సంస్థ ఉన్నతాధికారులతో స్టాలిన్ చర్చలు జరిపిన మీదట రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా గ్రీన్ హైడ్రోజెన్ ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని చెంగల్పట్టు జిల్లాలో నెలకొల్పనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీఆర్‌బీ రాజా, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి. విష్ణు, ఓమియం సంస్థ సీఈఓ ఆన్ ఫాలంటైన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ చొక్కలింగంకరుప్పయ్యా ఇతర అధికారులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న ఓమియం సంస్థ





కోలాహలంగా ఫార్ములా-4 రేస్

భారీగా తరలివచ్చిన అభిమానులు

పెరంబూర్, సెప్టెంబరు 1: నగరంలో ఫార్ములా-4 రేస్ ఆదివారం కోలాహలంగా జరిగాయి. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో దక్షిణాసియాలోనే తొలిసారిగా నగరంలో రాత్రి వేళ నిర్వహిస్తున్న ఫార్ములా-4 రేస్‌కు శనివారం ఎఫ్ఐఏ సర్టిఫికెట్ రావడం ఆలస్యం కావడంతో ప్రాక్టీస్, ప్రధాన రేస్ ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రాత్రి 7.10 గంటలకు ప్రారంభమైన పలురకాల రేస్‌లు 10.45 గంటల వరకు సాగాయి.

రెండు రకాల రేస్‌లు...

నగరంలో కారు రేస్ రెండు రకాలుగా జరిగాయి. ఫార్ములా-4 రేస్‌లో చెన్నై, గోవా, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, కొచ్చిన్, బెంగాల్ సహా 8 జట్లు పాల్గొన్నాయి. ఈ జట్లలో తలా ఇద్దరు చొప్పున పాల్గొనగా, ఒక్కో జట్టు రెండు కార్లు వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించారు. రెండోది ఇండియన్ రేసింగ్ లీగ్ రేస్‌లో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఒక్కో జట్టు నలుగురు మొత్తం 18 పురుషులు, ఆరుగురు మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కూడా ఒక్కో టీమ్ రెండు కార్లు వినియోగించుకొనేందుకు అనుమతించారు.

ఐదు విడతలుగా పోటీలు...

ఈ ఏడాది ఫార్ములా-4 రేస్ పోటీలు దేశంలో ఐదు విడతలుగా జరుగనున్నాయి. తొలి పోటీ గత నెల 24,25 తేదీల్లో ఇరుగాట్టుకోటలో జరుగగా, రెండో పోటీ ఐల్యాండ్ గ్రౌండ్స్ శని, ఆదివారాలు జరిగాయి. మూడో విడత పోటీలు ఈ నెల 13 నుంచి 15వ తేది వరకు కోయంబత్తూర్, నాలుగవ విడత పోటీలు అక్టోబరులో గోవా, ఐదవ విడత పోటీలు నవంబరులో కొల్‌కతాలోను జరుగుతాయి.

10 గంటల నుంచే ప్రారంభం...

ఆదివారం పోటీలు 10 గంటలకు ప్రారంభమయ్యాయి. తొలుత రేస్ వెళ్లే మార్గంపై ట్రయల్ రన్, భద్రతా అంశాలు పరిశీలించారు. 10.15 నుంచి ప్రాక్టీస్, ప్రధాన రేస్‌లు జరిగాయి. అర్ధరాత్రి వరకు ఈ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. రేస్‌ల మధ్యలో ప్రేక్షకులను ఉత్సాహపరిచేలా కారు విన్యాసాలు, మహిళలు ద్విచక్రవాహనాలపై సాహసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ సందడి...

నగరంలో జరుగుతున్న ఫార్ములా-4 రేస్ చూసేందుకు భారత క్రికెట్ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలి ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ... ఫార్ములా రేస్-4 కోసం చెన్నై రావడం ఆనందంగా ఉందని తెలిపారు. కాగా 'బెంగాల్ టైగర్ ఫార్ములా' టీమ్‌కు సౌరవ్ గంగూలి యజమానిగా వ్యవహరిస్తుండడం గమనార్హం...

రేస్‌లో స్వల్ప అపశృతి

ఫార్ములా-4 రేస్ స్వల్ప అపశృతి చేసుకుంది. ఉదయం నుంచి ప్రాక్టీస్ రేస్ నిర్వహించగా,ప్రధాన రేస్ సాయంత్రం ప్రారంభమైంది. ఈ పోటీలో చివరి రౌండ్‌లో రెండు కార్లు ఢీకొనడంతో రేస్ మధ్యలోనే నిలిపివేశారు. చివరి రౌండ్‌లో రేసర్ డిల్జిత్ విజేతగా ప్రకటించారు. కాగా, ఈ పోటీలు తిలకించేందుకు తెలుగు నటుడు నాగచైతన్య, బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం, నటి త్రిష, సంగీత దర్శకుడు యువన్ శంకర్‌రాజా తదితర ప్రముఖులు తరలివచ్చారు.

కుక్కల వేటలో కార్మికులు...

శనివారం రాత్రి కార్ రేస్ ప్రారంభమయ్యే సమయంలో హఠాత్తుగా ఓ కుక్క రేస్ మార్గంలో ప్రవేశించింది. ఇరువైపులా గోడలు, ఇనుప కంచె ఉండడంతో కుక్క ఎటూ వెళ్లలేకపోవడం, మరోవైపు రేస్ చూసేందుకు వచ్చిన వారి కేకలతో ఆ కుక్క రేస్ మార్గంలో పరుగులు తీసింది. దీంతో, ముందు జాగ్రత్త భద్రతా చర్యల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ఐల్యాండ్, పరిసర ప్రాంతాల్లోని కుక్కలను పారిశుధ్య కార్మికులు బంధించి వాహనంలో తరలించారు.

ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ఆస్కాలో అభిమానుల సందడి ● మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన


పవన్‌కళ్యాణ్ జన్మదినవేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఆస్కా అధ్యక్షులు కే సుబ్బారెడ్డి

ప్యారీస్, సెప్టెంబరు 1 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను రాజధాని నగరం చెన్నైలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. టీ.నగర్‌లోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ప్రాంగణంలోని గోదావరి హాలులో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు మా తెలుగుతల్లి ప్రార్థన గీతం, అతిథుల జ్యోతిప్రజ్వలన జరిగింది. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కా అధ్యక్షుడు డా. కే. సుబ్బారెడ్డి మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. కొణిదెల కుటుంబం ప్రజాసేవే లక్ష్యంగా జీవిస్తున్నారని, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని ఒక రోజు ముందుగానే కోలాహలంగా జరుపుకునేందుకు ఆస్కా వేదిక కావటం ఆనందంగా ఉందన్నారు. జనసేన చెన్నై కన్వీనర్ ఎ.తమ్మయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలో రక్తదానం చేసినవారే రియల్‌హీరోలని అభినందించారు. సిమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అందించిన సేవలు కూడా ప్రశంసనీయమన్నారు. అనంతరం తమ్మయ్యనాయుడు మాట్లాడుతూ సిమ్స్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రవి పచ్చముత్తు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్ సహా అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేశారు. రక్తదానం చేసినవారికి, వైద్యబృందానికి ధ్రువీకరణ పత్రాలు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం, టీ.నగర్ క్లబ్ అధ్యక్షుడు సినోరా అశోక్, ప్రముఖ పారిశ్రామికవేత్త శివప్రసాద్, సిమ్స్ డైరెక్టర్ దేవకన్ను, జనరల్ మేనేజర్ వైష్ణవి, సభ్యులు వై రాజేశ్వరరావు, ఎంఎస్‌వీ సుధాకర్, చదలవాడ విజయకుమార్, అజయ్‌కిషోర్, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేకంగా డిజైన్ చేయించిన కేక్‌ను సుబ్బారెడ్డి కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి


సావనీర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ తదితరులు

మహిళావిద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం !

గవర్నర్ ఆర్ఎన్ రవి ● ఘనంగా కేటీసీటీ స్కూల్ శతవార్షికోత్సవాలు

ప్యారీస్, సెప్టెంబరు 1 : మహిళా విద్యతోనే దేశం ప్రగతి పథంలో పయనించగలుగుతుందని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎస్ రవి పేర్కొన్నారు. శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం అండ్ చారిటీస్ (ఎస్కేపీడీ) నిర్వహణలోని కేటీసీటీ ప్రాథమిక, ఉన్నత బాలికల పాఠశాలల శతవార్షికోత్సవాలు ఆదివారం కుచలాంబాళ్ కల్యాణ మండపంలో జరిగాయి. ఎస్కేపీడీ మేనేజ్‌మెంట్ కమిటీ, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం స్వాగతోపన్యాసం చేయగా, కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాల హెచ్ఎం కే అనిల్ పాఠశాల చరిత్ర వివరించారు. జ్యోతి ప్రజ్వలనం అనంతరం కుంభస్థాపం, వందేళ్ల శిలాఫలకం, ప్రత్యేక సంచికను గవర్నర్ ఆవిష్కరించారు. ఆ తర్వాత మాజీ ట్రస్టీలకు జ్ఞాపిక అందించారు. జై వాసవీ అనే నినాదంతో గవర్నర్ ప్రసంగాన్ని కొనసాగించారు. ఘన చరిత్ర కలిగిన కేటీసీటీ విద్యా సంస్థల శతవార్షికోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. 1924లో చిన్నారులకు అక్షరాలు నేర్పి, నేడు మహావృక్షంలా ఎదిగిన ఈ పాఠశాలలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. మహిళా విద్యావంతులు న్న ప్రాంతాలు కళకళలాడుతూ ఉంటాయన్నారు. ప్రపంచంలో భారతదేశం ఆర్థికంగా ఆరో స్థానంలో ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వేడుకల్లో గౌరవ అతిథిగా కేటీసీటీ పూర్వ విద్యార్థిని డాక్టర్ రమా జయవంత్ పాల్గొని ప్రసంగించారు. ఎస్కేపీడీ ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్, పాలకమండలి సభ్యులు దేసు లక్ష్మీ నారాయణ, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్‌బాబు, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్, సలహాదారులు డాక్టర్ జీవీ రావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చుక్కా రేవతి, నగర ప్రముఖులు అజంతా కనిగెలుపుల శంకరరావు, పీవీఆర్ కృష్ణారావు, సీఎంకే రెడ్డి, డాక్టర్ టీ మోహనశ్రీ తదితరులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి మహిళాకళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ వేడుకలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.


సభకు హాజరైన ప్రముఖులు, పూర్వ విద్యార్థులు

తిరుచ్చి మెట్రోరైలు ప్రాజెక్టుపై కాంగ్రెస్, డీఎంకే ఎంపీల వాగ్యుద్ధం

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరంలో చేపట్టనున్న మెట్రోరైలు ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, పెరంబలూరు డీఎంకే ఎంపీ అరుణ్ నెహ్రూ మధ్య నెలకొన్న వాగ్యుద్ధం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. రాష్ట్రంలో డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, డీఎంకే నేతల మధ్య తరచూ విభేధాలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్ జాతీయ నాయకుల జోక్యంతో అవి సమసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా శివగంగ నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీ కారీ చిదంబరం, పెరంబలూరు డీఎంకే ఎంపీ అరుణ్ నెహ్రూ పరస్పరం ప్రకటనల యుద్ధానికి పాల్పడుతున్నారు. రాజధాని నగరం చెన్నై నగరంలో అమలు చేస్తున్నట్లు తిరుచ్చి లో మెట్రోరైలు ప్రాజెక్టును చేపట్టడానికి రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ప్రాథమిక స్థాయి పరిశీలనలో ఉంది. రూ.11 వేల కోట్లతో ఆ నగరంలో మెట్రోరైలు ప్రాజెక్టును అమలు చేయాలని డీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కార్తీ చిదంబరం తన ఎక్స్‌పేజీలో పెట్టిన సందేశంలో తిరుచ్చి నగరానికి ఇప్పుడు మెట్రోరైలు ప్రాజెక్టు అవసరమా? అనవసరమైన పథకాల కోసం కాకుండా రహదారులు నిర్మించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తే మంచిదన్నారు. కార్తీ చిదంబరం చేసిన వ్యాఖ్యలపై పెరంబలూరు డీఎంకే ఎంపీ అరుణ్‌నెహ్రూ కౌంటర్ ఇస్తూ, తాను పెరంబలూరు ఎంపీగా ఉన్నానని, తన లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో తిరుచ్చి జిల్లాకు చెందిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని, వాటికి కూడా ప్రతినిధిగా ఉన్న తాను చేపట్టిన క్షేత్ర పరిశీలనలో తిరుచ్చి నగరానికి మెట్రోరైలు అత్యంత అవసరమని ఆ నగరవాసులంతా చెబుతున్నారని తెలిపారు. తిరుచ్చి నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నగరం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని అనవసరమైన వ్యాఖ్యలు మానుకోవడం అత్యుత్తమం అంటూ బదులిచ్చారు. ఇదిలా ఉండగా డీఎంకే ఎంపీ అరుణ్‌నెహ్రూ తిరుచ్చినగరానికి మెట్రోరైలు అవసరమంటూ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, డీఎంకే ఎంపీ అరుణ్ నెహ్రూ మధ్య చోటుచేసుకున్న ఈ మాటల యుద్ధం రెండు పార్టీలలో చర్చనీయాంశంగా మారింది.


కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, డీఎంకే ఎంపీ అరుణ్‌నెహ్రూ

కూవంపై మేయర్‌కు లేఖ...

ఇదిలా ఉండగా కూవంనది ప్రక్షాళనపై శ్వేతపత్రం జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీ కార్తీ చిదంబరం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియకు లేఖ రాశారు. నగరంలోని కూవం నది మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.750 కోట్లు కేటాయించిందని, ఆ నిధుల్లో ఇప్పటికే రూ.329 కోట్ల మేరకు ఖర్చు చేశారని, ప్రస్తుతం కూవం ప్రక్షాళన పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలేమిటి? ఆ ప్రాజెక్టు అంచనా వ్యయంలో మార్పులు చేశారా? అన్న ప్రశ్నలకు సమాధానాలివ్వాలని కోరారు. అడయార్‌వాగు మరమ్మతు పనులు, బకింగ్‌హామ్ కాలువ మరమ్మతులు, కూవం నది మరమ్మతు పనులు ఏయే దశల్లో ఉన్నాయో, వీటికి ఎంత మేరకు ఖర్చు చేశారో వివరాలతో శ్వేత పత్రం జారీ చేయాలని కార్తీ చిదంబరం మేయర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఇంజనీరింగ్, వైద్య కోర్సులకు తమిళ పాఠ్యపుస్తకాల సిద్ధం

పెరంబూర్, సెప్టెంబరు 1: ఇంజనీరింగ్, వైద్యం తదితర ఉన్నత విద్యకు సంబంధించి పాఠ్యపుస్తకాలు తమిళ భాషలో అందుబాటులోకి రానున్నాయి. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఇంజనీరింగ్, వైద్య కోర్సుల పాఠ్యపుస్తకాలను హిందీ భాషలో అందించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో, రాష్ట్రంలో కూడా తమిళ భాషలో ఇంజనీరింగ్, వైద్య కోర్సుల పాఠ్యపుస్తకాలు రూపొందించే ప్రక్రియ 2022లో ప్రారంభమైంది. తమిళనాడు పాఠ్యపుస్తకాలు, విద్య పనుల కార్పొరేషన్ చేపట్టింది. ఆ ప్రకారం, వైద్య కోర్సుల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు 2022లో ఐదు పుస్తకాలు అందజేశారు. వీటిలో మెడికల్ అనాటమీ సహా 2 పుస్తకాలు ఎక్కువ పేజీలతోను, మూడు పుస్తకాలు తక్కువ పేజీలున్నాయి. మెడికల్ అనాటమీ పుస్తకాన్ని మొదట పార్ట్-1 మాత్రమే విడుదల చేశారు. ప్రస్తుతం 2వ సంపుటి సహా మొత్తం తమిళంలోకి అనువదించబడి 36 వైద్యకళాశాలలు, లైబ్రరీలకు పంపించారు. దీని తర్వాత ఈ ఏడాది వైద్య కోర్సుల కోసం 700 నుంచి 800 పేజీల 'మెడికల్ మైక్రోబయాలజీ', 'ప్రసూతి శాస్త్రం'పై రెండు పుస్తకాలు, ఇంజనీరింగ్ కోర్సుకు సంబంధించి 4 పుస్తకాలు, ఇవి మినహా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలు సహా ఉన్నత విద్యా కోర్సుల కోసం ఆంగ్ల భాష పుస్తకాలు కూడా తమిళంలోకి అనువదించబడ్డాయి. అదే విధంగా, ఆంగ్ల సాహిత్యం తమిళం, తమిళ సాహిత్యం ఆంగ్లంతో సహా వివిధ భాషల్లోకి అనువదించారు. అలా, 120 పుస్తకాలు సిద్ధంకాగా, నవంబరు 25వ తేది కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో ఎంపీ శశిధరూర్ ఈ పుస్తకాలు విడుదల చేయనున్నట్లు తమిళనాడు పాఠ్యపుస్తకాలు మరియు విద్య పనుల కార్పొరేషన్ ప్రకటించింది. ఆ విధంగా ఉన్నత విద్యకు సంబంధించి 200 పాఠ్యపుస్తకాలు ప్రతి ఏడాది అనువదించి విడుదల చేయనున్నట్లు కార్పొరేషన్ తెలిపింది. ఈ ఏడాది 120 పుస్తకాలు తమిళంలో తర్జుమా చేయగా, మిగిలిన పుస్తకాలు జనవరి, మార్చి నెలకు సిద్ధమవుతాయని అధికారులు తెలిపారు.



సమాచార ధ్వని

రేపు మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: స్థానిక నుంగంబాక్కం లయోలా కళాశాలలో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో వృత్తి శిక్షణ, విక్రయ శాలలు, సూక్ష్మ, చిన్న వృత్తులకు సంబంధించి పంపిణీ హక్కులు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వ పథకాలు, రుణ సహాయాలు, హెర్బల్ సోపు, షాంపూల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాలపై వివరిస్తారు. ఇతర వివరాలకు 9361086551, 9871702700 నెంబర్లు సంప్రదించవచ్చు.

ఊటీ కొండ రైలు సేవలు ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 1: ఊటీ కొండ రైలు సేవలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. రైలు మార్గంలో కొండచరియలు విరిగిపడడంతో మేట్టుపాళయం-ఊటీ కొండ రైలు సేవలు రద్దయ్యాయి. కొండచరియలు తొలగించడంతో 23 రోజుల అనంతరం కొండ రైలు సేవలు యధావిధిగా ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.

నేటినుంచి విద్యార్థుల శిబిరాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: ప్లస్ టూ విద్యార్థుల్లో ఉన్నతవిద్యలో చేరనివారిని గుర్తించి వారిని ప్రోత్సహించేలా 'ఉయర్వుక్కు పడి' (అభివృద్ధి కోసం చదువు) అనే పేరుతో సోమవారం నుంచి అక్టోబరు 1వ తేది వరకు పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలను ఉన్నత విద్య మార్గదర్శకత్వంలో పాఠశాల నిర్వహణ కమిటీలు, పూర్వ విద్యార్థుల కమిటీలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి.

గ్రామాల్లో పైప్‌లైన్ ద్వారా తాగునీరు

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: కేంద్రప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామాల్లో 1.07 కోట్ల గృహాలకు ప్రత్యేక తాగునీటి కనెక్షన్ ఇచ్చే పనులు పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలులో ఉంది. రాష్ట్రంలో 1.25 కోట్ల గృహాలకు పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరాకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 85.8 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన గృహాలకు త్వరలో తాగునీటి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు మున్సిపాలిటీ నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు.

ఉప విద్యుత్ కేంద్రం ప్రారంభం

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: స్థానిక పూందమల్లిలో ఉప విద్యుత్ కేంద్రాన్ని సీఎంఆర్ఎల్ ప్రారంభించింది. రెండో విడత మెట్రోరైలు పథకం పనుల్లో భాగంగా మెట్రోరైళ్ల పర్యవేక్షణకు పూందమల్లిలో భారీ యార్డు ఏర్పాటుచేస్తున్నారు. ఇక్కడ విద్యుత్ అవసరాలు పూర్తిచేసేందుకు 110 కే.వి ఉపవిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీన్ని సీఎంఆర్ఎల్ అధికారులు శనివారం ప్రారంభించారు.

రూ.38లు పెరిగిన వాణిజ్య సిలిండర్

పెరంబూర్, సెప్టెంబరు 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.38కి పెరిగింది. ఆ ప్రకారం, గత నెల 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1817 ఉండగా, ఈనెల రూ.38 పెరిగి రూ.1855కు విక్రయమవుతోంది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు.

రామనాథపురం జిల్లాలో 144 సెక్షన్ అమలు

పెరంబూర్, సెప్టెంబరు 1: రామనాధపురం జిల్లా వ్యాప్తంగా రెండు నెలలు 144 సెక్షన్ విధిస్తూ జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జీత్ సింగ్ కాలోన్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని పరమకుడిలో ఇమ్మానువేల్ శేఖరన్ గురుపూజోత్సవం, కళుది పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ గురుపూజోత్సవం, జయంతి సందర్భంగా రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 9 నుంచి అక్టోబరు 31వ తేది వరకు అమలులో ఉంటాయి. ఈ వేడుకలకు వచ్చే పొరుగు జిల్లాల వారు అనుమతులు పొంది రావాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు రుణ మేళా

పెరంబూర్, సెప్టెంబరు 1: తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక రుణ మేళా నిర్వహించనున్నారు. రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల సమాఖ్య ఆధ్వర్యంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే వారు ఈ మేళాలో పాల్గొనవచ్చు. వివరాలకు 9962948002, 9444396845, 9445023485 నెంబర్లలో సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జనవరి వరకు తాత్కాలిక ఉపాధ్యాయులకు వేతనాలు

పెరంబూర్, సెప్టెంబరు 1: పాఠశాల విద్యాశాఖ పరిధిలోని పనిచేస్తున్న 3,000 మంది తాత్కాలిక సెకండరీ గ్రేడ్ టీచర్లకు 2025 జనవరి వరకు వేతనాలు అందజేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఎస్.మధుమతి విడుదల చేసిన ప్రకటనలో.... విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైన పాఠశాలల్లో 3,000 మంది తాత్కాలిక టీచర్లను నియమించగా, వారి పదవీకాలం జూలై నెలతో ముగిసింది. ఈ ఖాళీలు భర్తీచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పటివరకు 3,000 మంది టీచర్లు కొనసాగుతారని, వారికి వచ్చే ఏడాది జనవరి వరకు వేతనాలు అందించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

10న ఉపాధ్యాయుల సమ్మె

పెరంబూర్, సెప్టెంబరు 1: పాత పింఛన్ విధానం అమలు సహా 31 సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న సమ్మె చేపట్టనున్నట్లు తమిళనాడు ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల ఉద్యమాల జాయింట్ యాక్షన్ కమిటీ (డీఐటీజేఏసీ) ప్రకటించింది. ఈ మేరకు కమిటీ విడుదల చేసిన ప్రకటనలో.... తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో ఆందోళన చేపట్టామన్నారు. ఆ సమయంలో విద్యాశాఖ అధికారులు సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నేటికీ అమలుకాలేదన్నారు. సమస్యల సాధనకు ఈ నెల 3 నుంచి 9వ తేది వరకు కలెక్టర్లకు వినతిపత్రం సమర్పణ, సమ్మె సన్నాహక మహానాడు నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందని పక్షంలో 10వ తేది విధులు బహిష్కరించి సమ్మె చేపట్టనున్నట్లు కమిటీ ప్రకటించింది.

హొగెనేకల్‌లో పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్,సెప్టెంబరు1:హొగెనేకల్‌వద్ద కావేరి నదిలో నీటి ప్రవాహం అధికమైంది. శనివారం సాయంత్రం 22 వేల ఘనపుటడుగులుగా ఉన్న నీరు, ఆదివారం ఉదయం 25 వేల ఘనపుటడుగులకు పెరిగింది. కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నీటి రాక అధికమైంది. అలాగే, కర్ణాటక డ్యాంల నుంచి 22 వేల ఘనపుటడుగుల నీరు నదిలోకి విడుదల చేస్తుండడంతో హొగెనేకల్‌కు నీటి రాక పెరిగింది. దీంతో కావేరి నదిలో దోనెల సవారీ, జలపాతాల వద్ద స్నానాలకు అధికారులు నిషేధం విధించారు.

మేట్టూరు డ్యాం నీటి విడుదల పెంపు...

డెల్టా జిల్లాలకు మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేస్తున్న సాగునీరు 13,500 ఘనపుటడుగుకు పెంచారు. ప్రస్తుతం డ్యాంలోకి నీటి రాక 22 వేల ఘనపుటడుగులుగా ఉంది.

లబ్దిదారులకు బీమా కార్డుల పంపిణి


బీమా కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే అమ్ములు

వేలూరు, సెప్టెంబరు 1: గుడియాత్తం ధర్నామ్‌పేటలో మక్కా మసీదు తరపున ఆధా ర్ కార్డులు, ముఖ్యమంత్రి ఆరోగ్య బీమా కార్డులు అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమ్ములు లబ్దిదారులకు కార్డులు అందించారు. కార్యక్రమంలో గుడియాత్తం సబ్ కలెక్టర్ సుబలక్ష్మి, గుడియాత్తం తహసీల్దార్ చిత్రాదేవి, గుడియాత్తం మున్సిపల్ కౌన్సిలర్లు అన్వర్ భాషా, అజీంసలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 1: తమిళనాడు ప్రకృతి వ్యవసాయ సంఘం తరపున వ్యవసాయ శాఖ ఎగ్జిబిషన్, విక్రయా లు కేవీ కుప్పం సమీపం కలామ్‌పట్టు గ్రామంలో ఆదివారం ప్రారంభమైంది. సంఘ అధ్యక్షుడు ఇలైఅయగన్ ఎగ్జిబిషన్ ప్రారంభించగా, సెక్రటరీ అరుల్ జేమ్స్ ఎడ్విన్ ఎగ్జిబిషన్ గురించి వివరించారు. సంఘ ఉపాధ్యక్షుడు గణేష్ ఆహ్వానం పలుకగా, కలెక్టర్ సుబ్బులక్ష్మి ఎగ్జిబిషన్ పరిశీలించి విక్రయాలకు ప్రారంభించారు. కార్యక్రమంలో మక్కల్ సంక్షేమ ఆర్గనైజర్ సెంథమిల్ సెల్వన్, కోశాధికారి నవీన్‌కృష్ణన్, సెక్రటరీ జనార్ధనన్ సహా పలువురు పాల్గొన్నారు.

విన్నంపల్లిలో ఉచిత వైద్యశిబిరం


శిబిరంలో పాల్గొన్న అతిథులు, వైద్యులు, సిబ్బంది

వేలూరు, సెప్టెంబరు 1: స్థానిక కాట్పాడి సమీపం విన్నంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. వేలూరు వీఐటీ, రాణిపేట స్కడర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ వైద్యశిబిరాన్ని పంచాయతీ సర్పంచ్ మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, సుమారు రూ.1 లక్ష విలువైన మందులు, మాత్రలు ఉచితంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

చెంబరంబాక్కంకు 300 ఘనపుటడుగుల నీరు



ఐసిఎఫ్, సెప్టెంబరు 1: నగర శివారు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో చెంబరంబాక్కం జలాశయానికి 300 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. శుక్ర, శనివారాల్లో శివారు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిశాయి. దీంతో తాగునీటి జలాశయాలైన పూండి, చోళవరం, పుళల్, కన్నన్ కోట తేర్వాయ్‌కండిగ, చెంబరంబాక్కం నీటిమట్టాలు పెరిగాయి. వీటిలో చెంబరంబాక్కం జలాశయానికి సెకనుకు 300 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నీటిమట్టం పెరిగే అవకాశముందని, ఇతర జలాశయాల్లోను నీటిమట్టాలు పెరిగాయని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

ప్రజాసమస్యలు వదిలేసి కారు రేస్‌లా ?

- మాజీ మంత్రి జయకుమార్ ఆగ్రహం

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సమస్యలను వదిలిపెట్టి ఫార్ములా కారు రేస్‌లు నిర్వహించడం అవసరమేనా అని అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి డి.జయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పెరంబూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పార్టీ శ్రేణులకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్లకు కొమ్ముకాసే విధంగానే డీఎంకే పాలన కొనసాగుతోందని, రాష్ట్రమంతటా నిరుపేద క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, వారిని ప్రభుత్వం చేరి అత్యుత్తమ క్రీడాకారులుగా చేయడం మంచిదని, అయితే కోటీశ్వరులు, ధనవంతుల కోసం నిర్వహించే ఫార్ములా కార్ రేసులను ప్రభుత్వమే నడపటం న్యాయమేనా అని ప్రశ్నించారు.

హెల్మెట్ ధరించని 300 మందికి జరిమానా

ప్యారీస్, సెప్టెంబరు 1 : తాంబరం ప్రాంతంలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన 300 మందికి తలా రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ విభాగం అధికారులు తెలిపారు. తాంబరం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తున్న వాహనచోదకులపై కేసు నమోదుచేసి చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు తాంబరం, క్రోంపేట, పల్లావరం ప్రాంతాల్లో హెల్మెట్ ధరించని 300 మంది ద్విచక్రవాహనదారులకు శుక్రవారం తలా రూ.1,000 చొప్పున సుమారు రూ.3 లక్షల వరకు జరిమానా విధించారు.

హిందీ నేర్చుకొనే రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 1 : హిందీ ప్రచార సభ ద్వారా ఆ భాషా పరీక్షలు రాయడంలో దక్షిణాది రాష్ట్రాల్లోనే తమిళనాడు ప్రథమస్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం హిందీని కార్యాలయ భాషగా, ఆంగ్లాన్ని అదనపు కార్యాలయ భాషగా అంగీకరించింది. ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాల్లో బాల్యం నుంచే హిందీ బోధించేలా కొత్త జాతీయ విద్యా విధానం కేంద్రప్రభుత్వం రూపొందించింది. దీన్ని రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. అయినప్పటికీ, చెన్నైలో ఉన్న దక్షిణ భారత్ హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో 8 హిందీ పాఠ్యాంశాలకు జరిగిన పరీక్షల్లో చెన్నై నుంచి 1,16,611 మంది సహా రాష్ట్ర వ్యాప్తంగా 3,54,655 మంది రాశారు. అలాగే, ఆంధ్రలో 1,04,959 మంది, కర్ణాటకలో 5,584 మంది, కేరళలో 8,452 మంది పరీక్షలు రాశారు. దీంతో, దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ పరీక్షలు రాయడంలో తమిళనాడు ప్రథమస్థానంలో ఉంది.

రేపు అన్నాడీఎంకే ఆందోళన

ఐసిఎఫ్, సెప్టెంబరు 1 : తాంబరం కార్పొరేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన జరగనుంది. తాంబరం కార్పొరేషన్ మూడో మండల పరిధిలోని సెంబాక్కం, రాజకీల్పాక్కం, గౌరవాక్కం ప్రాంతాల్లో ఉన్న తాగునీటి కనెక్షన్లు, ఇంటి పట్టాలు, అమ్మ క్యాంటీన్‌లో సక్రమం గా వస్తువుల సరఫరా, భూగర్భ డ్రైనేజీ పథకం పనులు సత్వరం పూర్తిచేయాలి వంటి డిమాండ్లతో చెంగల్పట్టు పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మంగళ వారం సాయంత్రం 4 గంటలకు కామరాజపురం బస్టాండ్ సమీపంలో మహిళా విభాగం కార్యదర్శి వలర్మతి ఆధ్వర్యంలో ఆందోళన జరుగుతుందని ఆ పార్టీ ప్రకటన విడుదల చేసింది.

257 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత


జాబ్ మేళా ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 1: జిల్లా ఉద్యోగ అవకాశాలు, శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రైవేటు జాబ్ మేళాల నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ మేళాలో 1,423 మంది పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా, కార్యక్రమంలో పాల్గొన్న ప్రైవేటు సంస్థలు 149 మంది పురుషులు, 106 మహిళలను ఎంపిక చేసుకున్నాయి. ఎంపికైన వారికి కలెక్టర్ సుబ్బులక్ష్మి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, ఉద్యోగ అవకాశాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గాంధీ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ జగద్రక్షకన్‌కు 'కలైంజర్' పురస్కారం

పెరంబూర్, సెప్టెంబరు 1: డీఎంకే ముప్పెరుం విళాలో ఆ పార్టీ ఎంపీ జగద్రక్షకన్‌కు 'కలైంజర్' పురస్కారం అందజేయనున్నారు. డీఎంకే వజ్రోత్సవాలు ఈ నెల 17న నందనంలోని వైఎంసీఏ మైదానంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న ఐదుగురికి పురస్కారాలు అందజేయనున్నారు. ఆ ప్రకారం, పురస్కారాలకు ఎంపికైన వారి పేర్లను డీఎంకే ప్రధాన కార్యాలయం ఆదివారం వెలువరించింది. పాపమ్మాళ్ (పెరియార్ పురస్కారం), అరంతాంగతి మీసారామనాథన్ (అన్నా పురస్కారం), ఎస్.జగద్రక్షకన్ (కలైంజర్ పురస్కారం), కవి తమిళ్‌దాసన్ (పావేందర్ పురస్కారం), పీపీ రాజన్ (పేరాసియర్ పురస్కారం) అందజేయనున్నట్లు డీఎంకే ప్రకటించింది.

ఎన్నెల్సీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ఎన్నెల్సీ సొరంగం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా నైవేలిలోని ఎన్నెల్సీ రెండో సొరంగం వద్ద పని చేసే కాంట్రాక్టు కార్మికులు ఆదివారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఎన్నెల్సీ సంస్థ మూడు సొరంగాల్లో తవ్వకాలు చేపడుతోంది. మందారకుప్పం వద్దనున్న రెండో సొరంగంలో బొగ్గు తవ్వకాలను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఓ సంస్థ 123 మందిని కాంట్రాక్టు కార్మికులతో తవ్వకాలను జరుపుతోంది. ఆ సంస్థ ఒప్పందం శనివారం ముగియడంతో కాంట్రాక్టు కార్మికులను ఆదివారం నుంచి పనుల్లోకి రావద్దని ప్రకటించారు. దీంతో దిగ్ర్భాంతి చెందిన కార్మికులు ఎన్నెల్సీ రెండో సొరంగమార్గం వద్ద ధర్నా జరిపారు. ఎన్నెల్సీ యాజమాన్యమే తమను ఒప్పంద కార్మికులుగా నియమించి ఉపాధి కల్పించాలంటూ కార్మికులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎన్నెల్సీ ఉన్నతాధికారులు ఆందోళన జరుపుతున్న కార్మికులతో చర్చలు జరిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోటీ : సీమాన్

పెరంబూర్, సెప్టెంబరు 1: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీచేయనున్నట్లు నామ్ తమిళర్ పార్టీ అధ్యక్షుడు సీమాన్ తెలిపారు. తూత్తుకుడిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటికే 60 శాసనభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశామని, మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల పరిశీలన జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు వేతనాలు అందించేందుకు నిధులు కొరత, పైకప్పు పడి విద్యార్థులు గాయాలపాలవుతున్నా, ఆ భవనాలను మరమ్మతులు చేపట్టలేని ప్రభుత్వం, కోట్లు వెచ్చించి ఫార్ములా-4 రేస్ నిర్వహించవచ్చా అంటూ సీమాన్ ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో అత్తాకోడళ్ల మృతి


భాగ్యలక్ష్మి, రాఘవి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 1: తిరుప్పూర్ జిల్లా ఊదియూర్ సమీపంలో వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో అత్తాకోడళ్లు మృతిచెందారు. కాంగేయంకు చెంది మదివానన్ తన కుమారుడి మొదటి జన్మదినం సందర్భంగా ఆదివారం ఉదయం దైవ దర్శనానికి భార్య రాఘవి, తల్లి భాగ్యలక్ష్మి, కుమారుడితో కలసి కారులో బయల్దేరాడు. కుట్టైకాడు ప్రాంతంలో కారు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులోని అందరికీ గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు కారు శిధిలాల నుంచి వారిని రక్షించి ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో రాఘవి, భాగ్యలక్ష్మి మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నర్సింగ్ విద్యార్థినికి లైంగిక వేధింపులు

ప్రభుత్వ వైద్యుడి కోసం గాలింపు

పెరంబూర్, సెప్టెంబరు 1: వేలూరు జిల్లా నర్సింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, పరారైన ప్రభుత్వ వైద్యుడు కోసం గాలిస్తున్నారు. గుడియాత్తంలోని ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఎముకల చికిత్సా విభాగంలో పనిచేస్తున్న వైద్యుడు బాబు, ఓ నర్సింగ్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదుతో గుడియాత్తం పోలీసులు వైద్యుడు బాబుపై కేసు నమోదుచేసి అతడి కోసం గాలిస్తున్నారు.

కోడంబాక్కం మీనాక్షి కాలేజీకి బాంబు బెదిరింపు

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కంలోని మీనాక్షి మహిళా కళాశాలకు బాంబు బెదరింపు రావటంతో రాత్రంతా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి డీజీపీ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి మీనాక్షి కళాశాలలో కాసేపట్లో బాంబులు పేలతాయంటూ ఈ మెయిల్ పంపాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన ఆ కాలేజీ వద్దకు వెళ్ళి బాంబు స్క్వాడ్ మెటల్ డిటెక్టర్లతో ఆదివారం వేకువజాము వరకూ తనిఖీలు జరిపారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదరింపేనని తెలియటంతో కాలేజీ నిర్వాహకులు, పోలీసులు ఊరట చెందారు.

హాస్టల్‌లో విద్యార్థినులను గమనిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 1: తిరుపత్తూర్‌లో ప్రభుత్వ మహిళా హాస్టల్ ఉంది. ఈ హాస్టల్ పక్కనే కంప్యూటర్ సెంటర్ నడిపే ఫ్రెడిక్ అనే యువకుడు, హాస్టల్ కిటికీ నుంచి విద్యార్థినుల గమనిస్తుండడంతో, విద్యార్థులు కేకలు పెట్టి వార్డన్‌కు తెలియజేశారు. వార్డెన్ ఫిర్యాదుతో పోలీసులు ఫ్రెడిక్‌ను అరెస్ట్ చేసారు.

రైల్వేస్టేషన్లలో హరితవనాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: విల్లుపురం సహా ఐదు రైల్వేస్టేషన్ల ప్రాంగణాల్లో హరిత వనాలు ఏర్పాటుచేయనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ రైల్వేలో ప్రైవేటు సహకారంతో సౌర విద్యుదుత్పత్తి, వ్యర్థాల రీసైక్లింగ్ కేంద్రం, హరిత పార్కుల ఏర్పాటుపనులు జరుగుతున్నాయి. రైల్వే స్థలాలను గుర్తించి వాణిజ్యావసరాలు, ప్రయాణికుల సౌకర్యార్థం అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్లు, వాటి ప్రాంగణాల్లో పర్యావరణాన్ని పరిరక్షించేలా చిన్న హరిత వనాలు ఏర్పాటు చేయనున్నారు. చెన్నై రైల్వే డివిజన్‌లో 30 రైల్వేస్టేషన్లలో ఈ పార్క్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. అలాగే, తిరుచ్చి మండల పరిధిలో విల్లుపురం, అరియలూరు, తిరువణ్ణామలై, పోలూరు, విరుదాచలం రైల్వేస్టేషన్లలో ఉద్యానవనాల ఏర్పాటుకు టెండర్లు విడుదల చేశారు. ఒప్పంద సంస్థలు ఎంపిక కాగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ఫార్ములా-4 రేస్ బందోబస్తు.... గుండెపోటుతో పోలీసు అధికారి మృతి


మృతుడు శివకుమార్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 1: నగరంలో నిర్వహిస్తున్న ఫార్ములా-4 కార్ రేస్ బందోబస్తులో పాల్గొన్న అసిస్టెంట్ పోలీసు కమిషనర్ గుండెపోటుతో మృతి చెందారు. ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న శివకుమార్ (53) శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు అన్నాసాలై మన్రో విగ్రహం ఎదుట బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా గుండెపోటుకు గురైన ఆయన స్పృహతప్పి పడిపోయారు. అతడిని వెంటనే రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందారు.

సీఎం దిగ్భ్రాంతి...

ట్రిప్లికేన్ అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ మృతికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... విధుల్లో ఉన్న శివకుమార్ మృతిచెందిన సంఘటన తనకు దిగ్ర్భాంతి కలిగించింది. ఆయన మృతి పోలీసు శాఖకు లోటు అని పేర్కొన్నారు శివకుమార్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపడంతో పాటు రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

వరకట్నానికి మరో అబల బలి

- రూ.20 లక్షల డిమాండ్... కాఫీలో సైనేడ్ కలిపి హత్య
- భర్త, అత్త సహా నలుగురి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 1: వరకట్నం కోసం వేధించడంతో పాటు వివాహితను హతమార్చిన వ్యవహారంలో భర్త, అత్త సహా నలుగురు కటకటాలపాలయ్యారు. నీలగిరి జిల్లా ఊటీ సమీపం మార్కెట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ జవహరుల్లా (50)యాస్మిన్ (47) దంపతులకు ఇమ్రాన్ (27), ముక్తార్ (24) అనే ఇద్దరు కుమారులున్నారు. ఇమ్రాన్ ఊటీ వండిసోలై ప్రాంతానికి చెందిన ఆషికాపర్వీన్ (23)ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ విభేదాలు ఏర్పడుతున్న నేపథ్యంలో జూన్ 23న భర్త ఇంట్లో ఆషికాపర్వీన్ నోట్లో నురగలతో అనుమానాస్పదంగా మృతిచెందింది. ఆమె మృతదేహానికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో, సైనేడ్ కలిపిన కాఫీ తాగడంతో ఆమె మృతిచెందినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయమై పోలీసులు మాట్లాడుతూ... వివాహమైనప్పటి నుంచి రూ.20 లక్షల వరకట్నం తేవాలని తల్లి, తమ్ముడితో కాలసి ఇమ్రాన్ భార్యను వేధించేవాడన్నారు. ఊటీ మెయిన్ బజార్‌లోని నగల తయారీ దుకాణంలో సైనేడ్ తీసుకొచ్చి కాఫీలో కలిపి పర్వీన్‌కు అందజేసి హతమార్చారని విచారణలో తెలియడంతో ఇమ్మాన్, యాస్మిన్, ముక్తార్ సహా నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గున్న నీటిఏనుగు మృతి

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: ఇటీవ జన్మించిన నీటిఏనుగు పిల్ల మృతిచెందింది. వండలూరు జూ పార్క్‌లో ప్రకృతి అనే నీటిఏనుగు ఆగస్టు 21వ తేది ఓ పిల్లకు జన్మనిచ్చింది. తల్లి, పిల్లను ప్రత్యేక గదిలో ఉంచి పర్యవేక్షించారు. 25వ తేది నుంచి ప్రజల సందర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం నీటిఏనుగు పిల్ల హఠాత్తుగా మృతిచెందింది. కళేబరాన్ని పోస్టుమార్టం అనంతరం పార్క్‌లో ఖననం చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరమే తెలుస్తాయని పార్క్ నిర్వాహకులు తెలిపారు.

24 పశువుల స్వాధీనం

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: స్థానిక రెడ్‌హిల్స్ నుంచి కేరళకు తరలిస్తున్న 24 పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్ లారీలో కేరళకు పశువులు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. తిరువళ్లూర్-శ్రీపెరుంబుదూర్ మార్గంలో వస్తున్న కంటైనర్‌ను ఆపి పోలీసులు తనిఖీలు నిర్వహించి, అందులో ఉన్న 24 పశువులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను గమనించి పరారైన కంటైనర్ డ్రైవర్, క్లీనర్ కోసం గాలిస్తున్నారు.

సహకార గ్యాస్ ఏజెన్సీల లైసెన్స్ రద్దు

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: స్థానిక విల్లివాక్కం సహకార గ్యాస్ ఏజెన్సీల లైసెన్స్‌ను ఇండియన్ ఆయిల్ సంస్థ రద్దు చేసింది. సహకార శాఖ ఆధ్వర్యంలో పెరియార్ నగర్, విల్లివాక్కం ప్రాంతాల్లో గ్యాస్ ఏజెన్సీలు నిర్వహిస్తుండగా, వాటిల్లో పనిచేసే ఉద్యోగులు గృహ వంటగ్యాస్ సిలిండర్లను వాణిజ్య వినియోగాలకు విక్రయిస్తున్నట్లు ఇండియన్ ఆయిల్ అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో అధికారులు ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించి పెరియార్ నగర్, విల్లివాక్కం గ్యాస్ ఏజెన్సీల లైసెన్స్ రద్దుచేశారు.

తిరుచెందూరు తీరానికి జెల్లీ చేపలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 1: తిరుచెందూరు సముద్రతీరానికి జెల్లీ చేపలు కొట్టుకొస్తున్నాయి. సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆవని ఉత్సవాలతో భక్తుల రద్దీ అధికంగా ఉంది. వారు సముద్రంలో స్నానమాచరించే సమయంలో కొంత మందికి దురద పుడుతోంది. సముద్ర భద్రతా సిబ్బంది తనిఖీచేయగా, జెల్లీ చేపలు తీరానికి కొట్టుకురావడాన్ని గుర్తించారు. నాలుగు కిలోల బరువున్న ఓ జెల్లీ చేప కళేబరాన్ని అదే ప్రాంతంలో పూడ్చిపెట్టారు. చిన్న సైజు జెల్లీ చేపలు తీరానికి కొట్టుకొచ్చి కుట్టడం వల్లే భక్తులకు దురద ఏర్పడుతున్నట్లు గుర్తించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 1: పేర్నాంబట్టు సమీపం బందరపల్లి కొండల సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ సమీపంలో శనివారం రాత్రి పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కర్ణాటక రిజిస్ట్రేషన్ లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో నాలుగు టన్నుల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకొని, బెంగళూరుకు చెందిన లారీ డ్రైవర్ వరుణ్ , విజయ్, చరణ్‌లను అరెస్ట్ చేసి వేలూరు జైలుకు తరలించారు.

సెల్‌ఫోన్లు యజమానులకు అప్పగింత


యజమానులకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ మదివానన్

వేలూరు, సెప్టెంబరు 1: జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను తిరిగి వాటి యజమానులకు అప్పగించారు. సత్తువాచ్చేరిలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మదివానన్ పాల్గొని, రూ.2.5 కోట్ల విలువైన 232 సెల్‌ఫోన్లు వాటి యజమానులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు 180 మంది ఫిర్యాదు చేయగా, వాటిలో 122 స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మూడు నెలల క్రితం అందిన 160 ఫిర్యాదుల్లో 110 సెల్‌ఫోన్లు మొత్తం 232 సెల్‌ఫోన్లు వాటి యజమానులకు అప్పగించామని ఎస్పీ తెలిపారు.

రాకెట్ లాంచర్ పేలి ఒకరికి గాయాలు


పాతిపెట్టిన రాకెట్ లాంచర్లు

పెరంబూర్, సెప్టెంబరు 1: చెంగల్పట్టు జిల్లా హనుమంతపురం సమీపంలో పేలని రాకెట్ లాంచర్ పగులగొట్టేందుకు యత్నించగా హఠాత్తుగా పేలడంతో 52 ఏళ్ల వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. హనుమంతపురంలోని సైనిక శిక్షణా కేంద్రం సమీపంలోని కొండపై సైనికులు రాకెట్ లాంచర్ శిక్షణలో పాల్గొంటుంటారు. ఆ సమయంలో పేలని రాకెట్ లాంచర్లనుఓ గుంత తవ్వి అందులో వేస్తుంటారు. గ్రామస్తులు పేలని రాకెట్ లాంచర్‌లను పగులగొట్టి అందులోని ఇనుము, రాగి తీసి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. శనివారం సాయంత్రం ఆ ప్రాంతానికి చెందిన కోదండన్ పేలని రాకెట్ లాంచర్ పగలగొట్టేందుకు యత్నించగా, అది హఠాత్తుగా పేలి అతనికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- తాత్కాలిక ఉపాధ్యాయులు సహా నలుగురి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 1: కోయంబత్తూర్ జిల్లాలోని ఓ కళాశాలలో. శనివారం మధ్యాహ్నం మహిళలపై జరిగే నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు అధికారులు వెళ్లారు. విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సమయంలో, ఏడుగురు విద్యార్థినులు, కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు తాత్కాలిక ఉపాధ్యాయులు, ల్యాబ్ అసిస్టెంట్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా మాట్లాడడం, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దిగ్ర్భాంతి చెందిన అధికారులు వాల్పారై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, మురళిరాజ్, రాజపాండి సహా నలుగురిని అరెస్ట్ చేశారు.

అల్లర్ల నియంత్రణపై పోలీసుల మాక్ డ్రిల్


ఆందోళనకారుల్లా పోలీసులు


అల్లర్ల అదుపుకు సిద్ధమవుతున్న పోలీసులు


ఆందోళనకారులపై వాటర్ కెనాన్‌తో నీరు చల్లుతున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 1: తిరుచ్చి కేకే నగర్‌లోని జిల్లా సాయుధ దళ పోలీసు మైదానంలో శనివారం అల్లర్ల నియంత్రించేలా మాక్ డ్రిల్ నిర్వహించారు. తిరుచ్చి నగరంలో జరిగే వేడుకలు, పండుగ సమయాల్లో సాయుధదళ పోలీసులు అల్లర్లు నియంత్రించడంపై మాక్ డ్రిల్ (ఎంటీబీ ఆపరేషన్), అల్లర్లలో గాయపడిన వారిని రక్షించి ప్రాథమిక చికిత్స అందించడం తదితరాలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.కామిని నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాంతి భద్రతలు, క్రైం, ట్రాఫిక్, సాయుధదళాలకు చెందిన అధికారులు, పోలీసులు మొత్తం 575 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఆందోళనకారుల్లా దుస్తులు ధరించి రాళ్లు, కట్టెలు విసురుతూ అల్లర్లకు పాల్పడడంతో పాటు టైర్లు దగ్ధం చేశారు. అల్లర్లు అదుపుచేసేలా పోలీసులు వజ్ర వాహనం వినియోగించారు. అనంతరం ఓ పోలీసు అధికారి రెవెన్యూ అధికారిగా వచ్చి ఈ ఘటనపై అధికారులు, పోలీసులను విచారించారు. అనంతరం గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించారు. ఇవన్నీ చూసిన ప్రజలు నిజంగా అల్లర్లు జరుగుతున్నాయా అంటూ భయపడ్డారు. ఇటీవల జాతీయ విపత్తుల నిర్వహణ దళాలు గూడ్స్ షెడ్ ప్రాంతంలో ఇలాంటి మాక్ డ్రిల్ నిర్వహించగా, తాజాగా పోలీసులు కూడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం గమనార్హం.

వీఐటీ యూనివర్సిటీ 'రైతు బజార్'కు విశేష స్పందన

వేలూరు, సెప్టెంబరు 1: స్థానిక కాట్పాడిలో ఉన్న వీఐటీ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు బజార్‌కు విశేష స్పందన లభించింది. రెండు రోజులుగా నిర్వహించిన ఈ కార్యక్రమం ముగింపు వేడుకలు శనివారం సాయంత్రం జరిగాయి. కార్యక్రమానికి వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ అపూర్వ ముఖ్యఅతిథిగా పాల్గొని, ఉత్తమ స్టాల్స్ యజమానులకు బహుమతులు అందజేశారు. అలాగే, మొక్కలకు సోకే పురుగులు నిర్మూలించడం ఎలా? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అపూర్వ మాట్లాడుతూ... గతంతో వరి ఉత్పత్తిలో తంజావూరు జిల్లా మొదటి స్థానంలో ఉండేదని, ప్రస్తుతం వేలూరు, తిరువణ్ణామలై, తిరువళ్లూర్ జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. వ్యవసాయం రంగంలో యంత్రాల వినియోగం పెరిగిందని, కొత్త యంత్రాలు రూపొందించేలా విద్యార్థులు పరిశోధన చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్శిటీ ఉపాధ్యక్షులు సెల్వం, శంకర్ సహా పలువురు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో అతిథులు, నిర్వాహకులు



వాకథాన్ ప్రారంభిస్తున్న ఐపీఎస్ అధికారి ఎ.కయల్‌విళి, డాక్టర్ కార్తీక్‌నారాయణ్ తదితరులు

వృద్ధుల సంక్షేమం కోసం అతుల్యా సీనియర్ కేర్ వాకథాన్

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల కోసం వైద్యసదుపాయాలు అందుబాటులో ఉండేలా ఇళ్లు నిర్మించే అతుల్యా సీనియర్ కేర్ సంస్థ ఆదివారం ఉదయం ఎలియట్స్ బీచ్‌లో వాకథాన్ నిర్వహించారు. సుమారు 400 మంది పాల్గొన్న వాకథాన్‌ను గ్రేటర్‌చెన్నై జాయింట్ పోలీసు కమిషనర్ ఎ.కయల్‌విళి, అతుల్య సీనియర్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కార్తీక్ నారాయణ్. తమిళ సినీనటుడు కాత్తాడి రామ్మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారందరికీ టీ షర్టులు, ప్రశంసాపత్రాలను కూడా అందజేశారు.

'ఫైజిటల్' త్రీడీ వెబ్‌సైట్ ఆవిష్కరణ




అడయార్, సెప్టెంబరు 1: తమిళనాడు రాష్ట్రంలో ఆవిర్భవించి వినూత్నమైన, ప్రీమియం స్ట్రీట్ వేర్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన హౌస్ ఆఫ్ సాస్ తొలిసారి త్రీడీ ఫ్యాషన్ ప్లాట్‌ఫాం పేరుతో 'ఫైజిటల్' వెబ్‌సైట్ ఆవిష్కరించింది. ఈ మైలురాయి ఫ్యాషన్ రంగంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. భౌతిక, డిజిటల్ అనుభవాలను మిళితం చేసి వినియోగదారుల కోసం ప్రత్యేక ఫైజిటల్ షాపింగ్ ప్రయాణాన్ని అందించనుంది. దీన్ని ప్రముఖ నటుడు జీవా ప్రారంభించారు. ఇది చెన్నైకు చెందిన ఇంప్రెసివ్.10 అనే ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలో భాగస్వామ్యం కలిగివుంది. ఇది కృత్రిమ మేధస్సు (ఏఐ), త్రీడీ కామర్స్ వంటి అధునాతన సాంకేతికతలను ప్రభావితం చేయడానికి, ఇంటరాక్టివ్ షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందని నటుడు జీవా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫైజిటల్ నిర్వాహకుడు అఖిలేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అమలులోకి వచ్చిన టోల్ ఛార్జీల పెంపు



పెరంబూర్, సెప్టెంబరు 1: రాష్ట్రంలోని 25 టోల్‌ప్లాజాల్లో 5 నుంచి 7 శాతం ఛార్జీల పెంపు ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. జాతీయ రహదారుల కమిషన్ పర్యవేక్షణలో ఉన్న టోల్‌ప్లాజాల్లో ఏప్రిల్, సెప్టెంబరు నెలల్లో ఛార్జీలు పెంచుతుంటారు. దేశవ్యాప్తంగా ఉన్న 1,000కి పైగా టోల్‌ప్లాజాల్లో ఏడాదికి రెండు సార్లు ఛార్జీల పెంపు ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో పెరగాల్సిన టోల్ ఛార్జీలు పార్లమెంటు ఎన్నికల కారణంగా వాయిదాపడ్డాయి. ఎన్నికల ముగియడంతో జాతీయ రహదారుల కమిషన్ జూన్ నెలలో టోల్ ఛార్జీలు పెంచింది. ఆ ప్రకారం, రాష్ట్రంలోని 36 టోల్‌ప్లాజాల్లో టోల్ ఛార్జీలు 5 శాతం వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో మిగిలిన 25 టోల్‌ప్లాజాల్లో ఈ నెల 1 నుంచి టోల్ ఛార్జీలు 5 నుంచి 7 శాతం వరకు పెరిగాయి. విక్రవాండి, ఉళుందూర్‌పేట, సమయపురం, మదురై ఎలియార్‌పత్తి, ఓమలూరు, శ్రీపెరుంబుదూర్, వాలాజా సహా 25 టోల్ ప్లాజాల్లో ఛార్జీలు పెరిగాయి. టోల్ ఛార్జీల పెంపుతో వాహనచోదకులు రూ.5 నుంచి రూ.150 వరకు అదనపు భారం పడింది.

కన్నియాకుమారిలో పర్యాటకుల సందడి


వివేకానంద రాక్ వద్ద పర్యాటకులు

పెరంబూర్, సెప్టెంబరు 1: పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి ఆదివారం భక్తులతో సందడిగా మారింది. అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కన్నియాకుమారికి ప్రతిరోజు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామునే పర్యాటకులు త్రివేణి సంగమం, సన్ రైజ్ పాయింట్ రాక్ ప్రాంతాలకు చేరుకున్నారు. అనంతరం త్రివేణి సంగమంలో స్నానాలు చేసిన భక్తులు, పడవల్లో సముద్రం మధ్య ఉన్న వివేకానంద రాక్‌ను సందర్శించారు. అలాగే, గాంధీ మండపం, కామరాజర్ స్మారక మందిరం, సునామీ స్మారక పార్క్, బీచ్ సమీపంలోని తమిళన్ పార్క్, సన్‌సెట్ పాయింట్, ప్రభుత్వ మ్యూజియం, ఎకో పార్క్ తదితర ప్రాంతాలు కూడా పర్యాటకులతో కిటకిటలాడాయి. పర్యాటకుల రద్దీ అధికంగా ఉండడంతో పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది బీచ్ ప్రాంతాల్లో గస్తీ చేపట్టారు.

'నాడు స్టూడెంట్... నేడు 'ఇన్‌ఛార్జ్ డీన్'

● మదురై వైద్యకళాశాలలో ఆసక్తికర ఘటన


సెల్వారాణిని అభినందిస్తున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 1: మదురై ప్రభుత్వ రాజాజీ వైద్యశాల 'ఇన్‌చార్జ్ డీన్'గా వ్యవహరించిన ధర్మరాజ్ పదవీవిరమణ చేయడంతో ఆయనస్థానంలో 'ఇన్‌చార్జ్ డీన్'గా ప్రొఫెసర్ సెల్వరాణి బాధ్యతలు స్వీకరించారు. ఆమె, ఎంబీబీఎస్, ఎండీ తదితర కోర్సులు మదురై ప్రభుత్వ వైద్యకళాశాలల్లోనే పూర్తిచేయడం గమనార్హం. మదురై ప్రభుత్వ రాజాజీ ప్రభుత్వాసుపత్రి డీన్ రత్నవేలు ఏప్రిల్ 30న పదవీవిరమణ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి డీన్‌గా ధర్మరాజ్ వ్యవహరించారు. ఆయన కూడా పదవీవిరమణ పొందగా, డీన్ పదవిని భర్తీ చేయకుండా, ఇన్‌ఛార్జీ డీన్‌గా కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ సెల్వరాణిని నియమించారు. ఆమె శనివారమే బాధ్యతలు స్వీకరించారు. కాగా, సెల్వరాణి మదురై ప్రభుత్వ వైద్యకళాశాలలో 83లో ఎంబీబీఎస్, అనంతరం అదే కళాశాలలో ఎండీ (జనరల్ మెడిసిన్) పూర్తిచేశారు. ఇక్కడే 2024 నుంచి 2014 వరకు మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గాను, 2012-15 వరకు చెన్నైలో కార్డియాలజీ (డీఎం) కోర్సు పూర్తిచేశారు. అనంతరం తూత్తుకుడి ప్రభుత్వ వైద్యకళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గాను, అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై మదురై ప్రభుత్వ వైద్యకళాశాలలో కార్డియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 7 నెలలు పనిచేశారు. తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది మదురై ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో పనిచేస్తున్నారు.

మూడేళ్లు చెప్పులు లేకుండా నడిచా...!

● క్రికెటర్ నటరాజన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రికెటర్ నటరాజన్

పెరంబూర్, సెప్టెంబరు 1: మూడేళ్లకుపైగా కాళ్లకు చెప్పులు లేకుండా నడిచానని భారత క్రికెటర్ నటరాజన్ తెలిపారు. సేలం ఉడయాపట్టి ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నటరాజన్ మాట్లాడుతూ... నేను చదువుకొనేటప్పుడు శిక్షణ పొందేందుకు ఎలాంటి వసతులు కూడా లేవన్నారు. చెప్పులు లేకుండా మూడు, నాలుగేళ్లు పరిగెత్తానన్నారు. క్రీడాకారులు మంచి ఆహారం తీసుకోవాలని చెబుతుంటారన్నారు. కానీ, మన ఇంట్లో ఏం చేస్తారో అదే మంచి ఆహారమని, అమ్మ చేతి వంట నాకు మంచి ఆహారమన్నారు. కఠినంగా శ్రమిస్తేనే మనం తదుపరి లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. అవి క్రీడ అయినా చదువు అయినా, ఉద్యోగమైనా ఒకటే అన్నారు. రోజు ఓ గంటసేపు మైదానంలో ఆడుకోవాలన్నారు. ప్రస్తుతం ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. మొబైల్ ఫోన్ అనేది మనకు అవసరమైనంత వరకు వినియోగించాలి తప్ప వాటికి బానిస కారాదని సూచించారు. ఎంత ఉన్నత స్థితికి చేరుకున్నా సాధ్యమైనంత వరకు తోటివారికి సహాయం చేయాలని నటరాజన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

వెళ్లయంగిరి ఆలయానికి ఆవుదూడ కానుక


ఆలయ నిర్వాహకులకు ఆవుదూడను అందజేస్తున్న ఓపీఎస్

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పూండి వెళ్లయంగిరి ఆండవర్ ఆలయానికి మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) ఆవుదూడను కానుకగా సమర్పించారు. శనివారం రాత్రి ఆ ఆలయాన్ని సందర్శించిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత ఆవుదూడతో ఆలయ ప్రదక్షిణ చేశారు. తర్వాత ఉత్సవమూర్తి పల్లకీ మోసారు. చివరగా ఆవుదూడను ఆలయానికి కానుకగా సమర్పించారు.

మేట్టుపాళయంలో చిరుత సంచారం

● సీసీ కెమెరాల ఏర్పాటు


ఓ చెట్టు వద్ద సీసీ కెమెరా అమర్పుతున్న అటవీ సిబ్బంది

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం సమీపం సిరుముగై వద్ద చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనితో అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వేస్తున్నారు. మేట్టుపాళయం - వెళ్లిపాళయం రహదారిలోని కరుప్పరాయన్ ఆలయం సమీపంలో చిరుత పులి సంచరిస్తుండటాన్ని స్థానికులు చూసి దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయాన్ని తెలుపటంతో ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ మనోజ్ తెలిపారు.

కన్నన్‌కు హరిత సంరక్షక అవార్డు


కన్నన్‌కు అవార్డు అందజేస్తున్న పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్

ప్యారీస్, సెప్టెంబరు 1 : పీఎంకే అనుబంధ సంస్థ పసుమై తాయగం రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి ఐఎన్ కన్నన్‌కు ఈ యేడాది హరిత సంరక్షక అవార్డు లభించింది. నగరంలో ఆత్మీయమిత్రుల సంక్షేమ సంఘం 39వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ముఖ్య అతిథిగా హాజరై కన్నన్‌కు అవార్డు అందజేశారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాశి విశ్వనాథన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనవేల్, డాక్టర్ వేలాయుధం, పళని తదితరులు పాల్గొన్నారు.


సేలంలో స్వాతంత్ర్య సమరయోధుడు పులిదేవన్ 309వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి


స్వాతంత్ర్య సమరయోధుడు పులిదేవన్ 309వ జయంతి సందర్భంగా తెన్‌కాశి జిల్లా నెరకట్టుమ్ సెవల్‌గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, జిల్లా కలెక్టర్ ఏకే కమల్ ఎంపీ డాక్టర్ రాణి శ్రీకుమార్ తదితరులు

చిత్రజ్యోతి



చిత్రోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు

ముగిసిన 'కార్నర్ సీట్స్' ఫిల్మ్ ఫెస్టివల్

వి ఎంటర్‌టైన్మెంట్స్, భారత్ విశ్వవిద్యాలయానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ విజువల్ కమ్యూనికేషన్, షార్ట్‌ఫ్లిక్స్ ఓటీటీ సంయుక్తంగా రెండు రోజుల పాటు 'కార్నర్ సీట్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్-2024' పేరుతో నిర్వహించిన చిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. గత నెల 30, 31వ తేదీల్లో తాంబరంలోని భారత్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ కేంద్రంగా నిర్వహించారు. యూనివర్సిటీ నిర్వాహకులు డాక్టర్ జగద్రక్షకన్, డాక్టర్ శ్వేత సందీప్ ఆనంద్, డాక్టర్ సందీప్ ఆనంద్ ఈ వేడుకలను ప్రారంభించగా, మొత్తం 242కు పైగా దేశాల నుంచి ఎంపిక చేసిన చిత్రాలను విద్యార్థులకు చూపించడమేకాకుండా ప్రపంచ సినిమా విస్తృతిని వారికి వివరించే ప్రయత్నం చేశారు. ఇందులో తమిళం, తెలుగు, మలయాళం, హిందీ, కన్నడ, ఆంగ్లంతో పాటు ఇతర భారతీయ భాషా చిత్రాలు, వివిధ అంతర్జాతీయ భాషల చిత్రాలను ప్రదర్శించి, వాటిలో ఉత్తమ చిత్రాలకు అవార్డులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ధరణి రాజేంద్రన్, ఆర్ట్ డైరెక్టర్ మూర్తి, ఎడిటర్ సెల్వ, నటుడు అన్బుడన్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు. వి ఎంటర్‌టైన్మెంట్స్ విజయ్, శబరీనాథన్‌లు ముగింపు పలుకులు పలికారు.

5న 'ది గోట్' విడుదల

● టీవీకే నేతలకు షరతులు


'ది గోట్'లో విజయ్, స్నేహ

ఈ నెల 5వ తేదీన విజయ్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'ది గోట్ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) విడుదలకానున్న నేపథ్యంలో ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) శ్రేణులకు ఆ పార్టీ అధిష్ఠానం ఒక షరతు విధించింది. ఈ సినిమా టిక్కెట్లను పార్టీకి చెందిన నేతలు లేదా కార్యకర్తలు అధిక ధరకు విక్రయించరాదని స్పష్టం చేసింది. సినిమా టిక్కెట్ల ఆన్‌లైన్ బుకింగ్ శుక్రవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ తరహా కండిషన్ పెట్టింది. టీవీకే శ్రేణులు అధిక ధరకు టిక్కెట్లు అమ్మినట్టు తెలిసినా, పట్టుబడినా తగిన చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై నిర్మితమైన ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకుడు. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే నాలుగు పాటల లిరికల్ వీడియోలను రిలీజ్ చేయగా, ప్రేక్షకుల నుంచి స్పందన లభించింది. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, మాళవిక శర్మ, ప్రశాంత్, రాఘవ లారెన్స్, ప్రభుదేవా, ప్రేమ్‌జీ అమరన్, మోహన్, అజ్మల్ అమీర్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు.

దసరా బరిలో 'వేట్టయాన్'


డబ్బింగ్ స్టూడియోలో రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ - 'జైభీమ్' ఫేం టీజే జ్ఞానవేల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'వేట్టయాన్' దసరాకు సందడి చేయనున్నారు. దీంతో ఈ చిత్రం నిర్మాణాంతర పనులను చకచక పూర్తి చేస్తున్నారు. ఇందులోభాగంగా, రజనీకాంత్ తన పాత్రకు డబ్బింగ్ ప్రారంభించారు. ఇప్పటికే హీరోయిన్ మంజూ వారియర్ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేశారు. ఇపుడు తలైవర్ తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్నారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను చిత్ర బృందం రిలీజ్ చేసింది. లైకా ప్రొడక్షన్స్ నిర్మించే ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే, ఈ సినిమా విడుదల తేదీ సమీపిస్తుండటంతో నిర్మాణాంతర పనులను పరుగులుపెట్టిస్తున్నారు. అక్టోబరు 10న విడుదలకానున్న ఈ మూవీలో రజనీకాంత్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. అనిరుధ్ సంగీతం సమకూర్చుతున్న చిత్రం ఆడియో రిలీజ్ ఈ నెల 20వ తేదీ గ్రాండ్‌గా నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఆలోచిస్తోంది.

27న 'హిట్లర్'గా వస్తున్న విజయ్ ఆంటోనీ


'హిట్లర్'లో విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోనీ కథానాయకుడుగా నటించిన 'హిట్లర్' చిత్రాన్ని ఈ నెల 27వ తేదీన విడుదల చేయనున్నట్టు దర్శక నిర్మాతలు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. చెందూర్ ఇంటర్నేషనల్ పతాకంపై టీడీ రాజా, డీఆర్ సంజయ్ కుమార్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ఎస్ఏ ధన దర్శకుడు. ఈయన గతంలో 'పడైవీరన్', 'వానమ్ కొట్టటుమ్' వంటి చిత్రాలను తెరకెక్కించారు. విజయ్ ఆంటోనీ సరసన రియా సుమన్ హీరోయిన్‌గా నటించారు. చాలా గ్యాప్ తర్వాత సీనియర్ నటుడు చరణ్ రాజ్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. గౌతం మేనన్, రెడిన్ కింగ్‌స్లీ, వివేక్ ప్రసన్న, ఆడుకళం నరేన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. వివేక్ - మెర్విన్ ద్వయం సంగీతం అందించగా చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 27న విడుదల చేయనున్నట్టు తెలిపారు.